మూడు సిక్సర్లు.. ఆరు ఫోర్లు..

- క్రికెట్ వేసవి శిబిరానికి అపూర్వ స్పందన
- బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో మెళకువలు నేర్పిస్తున్న కోచ్‌లు


బ్యాటింగ్‌లో మెళకువలు నేర్పిస్తున్న కోచ్


వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు సూచనలు

ప్రకాశం నగర్: నేటితరం కుర్రాళ్లకు క్రికెట్ అంటే ఎంత క్రేజ్. బ్యాట్ పట్టి సిక్స్‌లు, ఫోర్లు కొట్టాలని ఉర్రూతలూగుతుంటారు. అటువంటి ఆసక్తి కలిగిన కుర్రాళ్లకు క్రికెట్‌లో మెళకువలు నేర్పి, క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు జిల్లా క్రికెట్ అసోసియేషన్ నిరంతర కృషి చేస్తోంది. సాధారణంగా పిల్లలు స్కూల్ నుంచి రాగానే బ్యాగు పక్కన పడేసి బ్యాట్, బాల్ తీసుకుని మైదానానికి పరుగెడుతుంటారు. అదే వేసవి సెలవుల్లో అయితే ఇంటి ధ్యాసే మర్చిపోయి ఆటలో మునిగిపోతారు. ఆటపై ఆసక్తి కలిగిన వారిలో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం సబ్ సెంటర్ విశేష కృషి చేస్తోంది.

ఏటా శిక్షణ శిబిరాలు

రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలోని జిల్లా క్రికెట్ అసోసియేషన్ సబ్ సెంటర్ ఆధ్వర్యంలో ఏటా వేసవి ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా ఈ ఏడాది ప్రారంభించిన శిక్షణ శిబిరానికి మంచి స్పందన లభిస్తోంది. నగరంతో పాటు పరిసర గ్రామాల నుంచి 120 మంది విద్యార్థులు శిబిరంలో చేరారు. వారి వయసు ఆధారంగా అండర్ –12, 14, 16 కేటగిరీలుగా విభజించారు. ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ తరపున హెడ్ కోచ్ జీరి హరినాథరెడ్డి నేతృత్వంలో మరో నలుగురు అసిస్టెంట్ కోచ్‌లు శిక్షణ ఇస్తున్నారు.

ఆటలో మెళకువలు

విద్యార్థుల ఆసక్తిని బట్టి బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్, వికెట్ కీపింగ్ తదితర విభాగాల్లో మెళకువలు నేర్పిస్తున్నారు. ముందుగా ఫిట్‌నెస్, ప్రాక్టీస్ అనంతరం ఆయా విభాగాల్లో శిక్షణ మొదలవుతోంది. ప్రత్యేక టీములుగా విభజించి వారి మధ్య మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. ఆటలో విద్యార్థులు చేస్తున్న లోపాలను సరిదిద్దుతూ వారికి మెళకువలు నేర్పిస్తున్నారు. ఇప్పటికే సబ్ సెంటర్‌లో 60 మంది వరకూ క్రీడాకారులు ఉదయం, సాయంత్రం సెషన్స్‌లో రెగ్యులర్ శిక్షణ తీసుకుంటున్నారు. వేసవి శిబిరంలో విద్యార్థులకు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు శిక్షణ ఇస్తున్నారు. ఈ శిబిరంలో ప్రతిభ కనబరుస్తున్న వారిని రెగ్యులర్ శిక్షణలోకి తీసుకుని సాయంత్రం సెషన్‌లోనూ శిక్షణ ఇస్తామని కోచ్‌లు తెలిపారు. టాలెంట్ ఉన్నవారు భవిష్యత్తులో జిల్లా జట్టుకు ఎంపికవుతారన్నారు.


బౌలింగ్‌లో శిక్షణ ఇస్తున్న కోచ్ హరినాథరెడ్డి

సబ్ సెంటర్ నుంచి జాతీయస్థాయికి..

రాజమహేంద్రవరం సబ్ సెంటర్‌లోని శిక్షణ పొందిన ఎంతోమంది విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తా చాటారు. హరినాథరెడ్డి నేతృత్వంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టుకు 20 మంది వరకు ప్రాతినిధ్యం వహించడం గమనార్హం. ఇటీవల శ్రవణ్, మోసేస్, లోకేష్, అండర్ –19 విభాగంలో విజయ్, శ్రవణ్ రాష్ట్ర జట్టుకు ఆడారు.

నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యం



యువతలోని క్రికెట్ నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యంగా సమ్మర్ క్యాంపైన్ నిర్వహిస్తున్నాం. విద్యార్థుల నుంచి మంచి స్పందన వచ్చింది. నాతో పాటు నలుగురు అసిస్టెంట్ కోచ్‌లు శిక్షణ ఇస్తున్నాం. టాలెంట్ కలిగిన వారిని రెగ్యులర్ శిక్షణకు తీసుకుంటాం. ప్రత్యేకంగా ప్లే గ్రౌండ్, ప్లేయర్స్ రూం, జిమ్, ఆఫీస్ రూం తదితర వసతులు ఉంటే క్రీడాకారులకు ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటుంది.

– జీరి హరినాథరెడ్డి, హెడ్ కోచ్

క్లుప్తంగా

ఉత్సాహంగా వేసవి శిక్షణ


తయారు చేసిన క్రాఫ్ట్స్‌తో విద్యార్థులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. పుస్తక పఠనం, నీతి కథలు చెప్పడం, హ్యాండ్ క్రాఫ్ట్, లైఫ్ స్కిల్స్, తెలుగు పద్యాలను విద్యార్థులకు వివరించారు. ట్రస్ట్ సభ్యులు మతల రమేష్, మాధవీలత, బొడ్డు శ్రీనివాసరావు, గొర్రెల బాలాజీ, కిర్ల తాతారావు పాల్గొన్నారు.

గొల్లపల్లికి అభినందనలు


గొల్లపల్లి సత్యనారాయణను సత్కరిస్తున్న జూపూడి ప్రభాకరరావు

కడియం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ఉపాధ్యాయుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణకు అభినందన సత్కారం లభించింది. అనపర్తి మండలం కొత్తూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల రెసిడెన్షియల్ కాలేజీలో శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్ తదితర ప్రముఖులు ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో నూకపెయ్యి వెంకట్రావు, లాజర్, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలు

కంబాలచెరువు: రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం జనరల్, వొకేషనల్ కోర్సులలో ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్ఎస్‌వీఎల్ నర్సింహం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15 నుంచి కళాశాలలో దరఖాస్తులు విక్రయిస్తామన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులకు సంబంధిత సర్టిఫికెట్ల నకళ్లు జతచేసి వెంటనే కళాశాలలో అందజేయాలన్నారు. మొదటిదశ అడ్మిషన్లు ఈనెల 26న ప్రారంభమవుతాయన్నారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులకు వచ్చేనెల ఒకటో తేదీ నుంచి తరగతులు నిర్వహిస్తామన్నారు.

న్యాయవిజ్ఞాన సదస్సు


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: ప్రపంచ మాతృదినోత్సవం సందర్భంగా స్థానిక డాక్టర్ ఏబీ నాగేశ్వరరావు స్మారక పార్కు ఆవరణలోని సీనియర్ సిటిజన్స్ డేకేర్ భవనంలో ఆదివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ మాతృమూర్తుల ఔన్నత్యం, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ గొప్పతనాన్ని వివరించారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంక్షేమం, భరణం చట్టం 2007, ఇతర న్యాయసేవలపై అవగాహన కల్పించారు. సదస్సులో అశోక్ కుమార్ జైన్, కె.నిర్మల, పి.రజనీ శేషసాయి, సీనియర్ ప్రజాసంక్షేమ వేదిక సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

మహాన్నదానం

కడియం: కడియపులంకలో అభయ ఆంజనేయస్వామి 12వ వార్షికోత్సవం, హనుమజ్జయంతి సందర్భంగా ఆదివారం మహాన్నదానం నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు. మండలంలోని పలు గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు జరిగాయి.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

రాజమహేంద్రవరం రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న గండేపల్లి కొత్తపేటకు చెందిన వల్లి నాగసత్య శివసాయి ప్రసాద్‌రెడ్డి (23) శనివారం రాత్రి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. గండేపల్లి కొత్తపేటకు చెందిన సాయిప్రసాద్ రెడ్డి లాలాచెరువు టీ టైమ్‌లో పనిచేస్తున్నాడు. ఈ నెల 12వ తేదీ టీ టైమ్ నుంచి రాజానగరం మెటీరియల్ కోసం వెళ్లి తిరిగి వస్తున్నాడు. దివాన్ చెరువు వద్దకు వచ్చేసరికి ఐఓసీఎల్ పెట్రోల్ బంకు ఎదురుగా ముందువెళుతున్న కారు సడన్‌గా ఆగడంతో మోటారు బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో తీవ్రగాయాలైన సాయిప్రసాద్ రెడ్డిని చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని బొమ్మూరు ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు తెలిపారు.

విద్యా ప్రదాతల సేవలు మహోన్నతం


కడియం గ్రంథాలయంలో ప్రముఖులను సత్కరిస్తున్న దృశ్యం

కడియం: విద్యా ప్రదాతల సేవలు మహోన్నతమని చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి కళాసేవాసమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, గౌరవ అధ్యక్షుడు అడపా సుబ్రహ్మణ్యం, చిలుకూరి శ్రీనివాసరావు, తోరాటి వసంతరావు అన్నారు. కడియం శాఖా గ్రంథాలయం, చెళ్లపిళ్ల సంస్థ ఆధ్వర్యంలో గ్రంథాలయ అధికారి శెట్టిపల్లి శ్రీదేవి అధ్యక్షతన జరిగిన వేసవి శిబిరంలో ఆదివారం పలువురు ప్రముఖులను సత్కరించారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో కడియం మండలాన్ని జిల్లాలో మొదటి స్థానంలో నిలిపిన ఎంఈఓ వి.లజపతిరాయ్, కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మాణం కోసం స్థలాన్ని సమకూర్చి, వేలమంది విద్యావంతులు కావడానికి సహకరించిన బొమ్మిరెడ్డి వంశీయులు బొమ్మిరెడ్డి చక్రధరరావుకు, రైతుసంఘం అధ్యక్షుడిగా దశాబ్దం పాటు కడియం ఆవ సమస్యలు తీర్చిన చిక్కాల ఈశ్వరరావు, ఆధ్యాత్మికంగా సేవలో ముందున్న రైతు నాయకుడు ఉప్పులూరి చిట్టియ్యను ఘనంగా సన్మానించి, వారి సేవలను ప్రశంసించారు. పాఠశాలకు స్థలం సమకూర్చడంతో పాటు వీరవరం వైపు వెళ్లే ప్రధాన రహదారికి స్థలం కూడా దానం చేసిన బొమ్మిరెడ్డి వారి పేరు హైస్కూల్లో ఒక భవనానికి పెట్టాలని సభలో వక్తలు కోరారు. అడపా సుబ్రహ్మణ్యం, ఉంగరాల వీరభద్రరావు, ఆకుల సూర్యనారాయణ తదితరులు మాట్లాడారు. ఉపాధ్యాయులు కుమ్మరపూడి రవిబాబు, కె.దొరబాబు, కొత్తూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ పుస్తక విజ్ఞానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా టైలర్స్ సంఘం నాయకుడు బడిగంటి సూర్యనారాయణ, రైతు నాయకులు బొమ్మిరెడ్డి వెంకట్రావు, బొమ్మిరెడ్డి కృష్ణమూర్తి, బొమ్మిరెడ్డి రమేష్, బొమ్మిరెడ్డి తమ్మయ్య, బొమ్మిరెడ్డి బుజ్జియ్య, బొమ్మిరెడ్డి శ్రీనివాసు పాల్గొన్నారు.

నగరంలో అండర్ వాటర్ ఫిష్ టన్నెల్ ఎగ్జిబిషన్

ప్రారంభించిన ఎంపీ భరత్‌రామ్


ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన అనంతరం వివిధ రకాల చేపలను తిలకిస్తున్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం రూరల్: వేసవి సెలవుల్లో నగరవాసులకు ఆహ్లాదకరమైన, అబ్బురపరిచే విధంగా చిన్నపెద్ద 42 రకాల ఎమ్యూజ్‌మెంట్స్‌తో అండర్ వాటర్ ఫిష్ టన్నెల్ ఎగ్జిబిషన్‌ను రాజమహేంద్రవరం నగరం వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ఆదివారం ఈ ఎగ్జిబిషన్‌ను వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తొలిసారిగా ఈ అండర్ వాటర్ షిప్ టన్నెల్‌ను భువనేశ్వరీ ట్రేడ్‌ఫైర్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసిందన్నారు. అతి తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆనందం కలిగించేలా ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారని, అలాగే వివిధ రాష్ట్రాలకు చెందిన వారు ఇక్కడ రకరకాల స్టాళ్లు ఏర్పాటు చేశారన్నారు.

ఎగ్జిబిషన్‌లో విలువైన చేపలు

మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అండర్ వాటర్ షిప్ టన్నెల్‌లో చాలా అరుదైన, ఖరీదైన చేపలు చూడవచ్చునని ఎగ్జిబిషన్ ఆర్గనైజర్లు శ్రీనివాస్, గోపీనాథ్ తెలిపారు. రూ.500 నుంచి రూ.6 లక్షలు విలువైన రకరకాల చేపలు ఉన్నాయన్నారు. రెండు నెలల పాటు, రూ.2 కోట్లు వెచ్చించి 200 మంది కార్మికులు ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటుకు కష్టపడ్డారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, మార్గాని సురేష్, కడియాల లక్ష్మణరావు, ఎన్వీ శ్రీనివాస్, కాంతారామ్ పాటిల్, రేలంగి వీర వెంకట సత్యనారాయణ, కొండేటి భీమారావు పాల్గొన్నారు.

ఫ్యూచర్‌కిడ్స్ విద్యార్థుల ప్రభంజనం


రాఘవ


సుహితా లాస్య


శబ్ద్ జైన్


వినాయక్‌రావు


తమన్నా ఏమజీద్


లలితా అనుజ్ఞ


తృప్తి అగర్వాల్

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక కవలగొయ్యిరోడ్డులోని ది ఫ్యూచర్ కిడ్స్ పాఠశాల విద్యార్థులు ఐసీఎస్‌సీ, ఐఎస్‌సీ 2023 పరీక్షలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారని పాఠశాల డైరెక్టర్ యేలేటి రవిబాబు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఐసీఎస్‌సీ 10వ తరగతి పరీక్ష ఫలితాలలో కొర్ను రాఘవ 98 శాతంతో ప్రథమ, వెలగల సుహితా లాస్య 97.6 శాతంతో ద్వితీయ, శబ్ద్ జైన్, బి.వినాయక్ రావు 97.4 శాతంతో తృతీయస్థానాలు సాధించారన్నారు. ఐఎస్‌సీ ప్లస్‌టూ (12వ తరగతి) పరీక్ష ఫలితాలలో తమన్నా ఏమజీద్ 99.25 శాతంతో ప్రథమ, లలితా అనుజ్ఞ పాతూరి 96 శాతంతో ద్వితీయ, తృప్తి అగర్వాల్ 94.5 శాతంతో తృతీయస్థానాల్లో నిలిచారన్నారు. ఆ విద్యార్థులను డైరెక్టర్ యేలేటి రవిబాబు, చైర్‌పర్సన్ విజయకుమారి, ప్రిన్సిపల్ శేషగిరిధర్, డీన్ హర్షిణి, వైస్ ప్రిన్సిపల్ సైదాఖాను అభినందించారు.

నిరంతర యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ కర్రి రామారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: నిరంతరం యోగా సాధన చేయడం ద్వారా అనేక రుగ్మతలకు పరిష్కారం లభిస్తుందని ప్రముఖ మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ కర్రి రామారెడ్డి అన్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రణవ సంకల్పయోగా సమితి యోగా శిక్షకుడు శ్రీనివాస్.. స్థానిక డీఎంహెచ్ స్కూల్ ఆవరణలో 15 రోజుల పాటు నిర్వహించిన వేసవి ఉచిత యోగా శిక్షణ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న రామారెడ్డి మాట్లాడుతూ నిత్యం ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలన్నారు. అనంతరం శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వపు మున్సిపల్ కమిషనర్ జితేంద్ర, వికాస తరంగిణి సమన్వయకర్త పద్మావతి రామానుజన్, మాజీ కార్పొరేటర్ డాక్టర్ అనసూరి పద్మలత, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

రాజానగరం: జాతీయ రహదారిపై దివాన్‌చెరువు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పదేళ్ల బాలుడు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. దేవీపట్నం మండలం రావిలంకకు చెందిన శివన్నదొర, అతడి తమ్ముడి కుమారుడైన అభిరామ్‌ను బైకుపై ఎక్కించుకుని రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న సమయంలో ప్రమాదానికి గురయ్యారు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరూ కిందకు పడిపోగా, అభిరామ్ తలకు బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన శివన్నదొరను రాజమహేంద్రవరం తరలించారు. బొమ్మూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చీటీ డబ్బులు అడిగినందుకు దాడి

కంబాలచెరువు: చీటీపాట సొమ్ము ఇవ్వడం లేదని ఇంటికెళ్లి అడిగిన వ్యక్తిపై దాడి చేసిన ఘటన ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. గోరక్షణపేటకు చెందిన ప్రసాద్ అదే ప్రాంతానికి చెందిన అప్పారావు అనే వ్యక్తి వద్ద రూ.లక్ష చీటీ పాట వేశాడు. దానికి సంబంధించి మొత్తం సొమ్ము చెల్లించాడు. గడువు పూర్తయి ఐదు నెలలు పూర్తయినా చీటీ సొమ్ము ఇవ్వడం లేదని అప్పారావును ప్రసాద్ అడిగాడు. దీంతో అప్పారావు, అతని కుమారుడు కలిసి ప్రసాద్‌పై దాడి చేసి గాయపర్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక


జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ప్రకాశం నగర్: జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జిల్లా బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక శిబిరం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు నక్కా శ్రీ నగేష్, 4వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బొంత శ్రీహరి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ రామచంద్రపురంలో జరిగిన అండర్ – 16 బాలికల జిల్లా జట్టు ప్రాబబుల్స్‌లో 20 మందిని ఎంపిక చేసి, వారికి ఇక్కడ మూడు రోజుల శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం 14 మందితో జిల్లా జట్టును ఎంపిక చేసి ఈనెల 16న పాలకొల్లు మండలం ఉల్లంపాడులో జరిగే బాస్కెట్‌బాల్ రాష్ట్ర చాంపియన్‌షిప్‌కు పంపిస్తామన్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అనిల్ కుమార్, సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వరావు, కార్యవర్గ సభ్యులు నాగేశ్వరరావు, నాథన్, జగస్ మూర్తి, రాంబాబు పాల్గొన్నారు.

చదరంగం పోటీలు

ప్రకాశం నగర్: జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శ్రీగౌతమి స్మార్ట్ స్కూల్లో జిల్లా చదరంగం పోటీలు నిర్వహించారు. పురుషుల విభాగంలో షణ్ముఖ రెడ్డి, రామ్‌చరణ్ తేజ, సాయేష్, సాకేత్, అలాగే మహిళల విభాగంలో కావ్యశ్రీ, ఆద్య, నేహశ్రీ, అన్విత విజేతలుగా నిలిచారు. సుమారు 60 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో మహిళా విభాగం నుంచి నలుగురు, పురుషుల విభాగం నుంచి నలుగురు తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవుతారని సంఘం కార్యదర్శి జీవీ కుమార్ తెలిపారు.

ఘనంగా ఒనువులమ్మ జాతర


జాతరలో గరగ నృత్యాల సందడి

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు గ్రామంలో ఒనువులమ్మ తల్లి జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. పుట్టింటి వారైనా మల్లిన కుటుంబ సభ్యులు, అత్తింటి వారైన పాలడుగుల కుటుంబ సభ్యుల పూజలతో కార్యక్రమాలు మొదలయ్యాయి. ఉదయం గరగలు, వరంగల్ డప్పులు, తీన్మార్ వాయిద్యాలతో గ్రామంలో అమ్మవారి చల్లఘటం ఊరేగింపు జరిగింది. సాయంత్రం పుణే డ్రమ్స్, జానపద నృత్యం, కేరళ వాయిద్యాలతో సందడి నెలకొంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సినిమాలు

శ్యామల:	రామబాణం
సూర్యమినీ:	గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ
సూర్యప్యాలెస్:	రామబాణం
స్వామి:	రామబాణం
శివజ్యోతి:	కస్టడీ
అనుశ్రీ:	విరూపాక్ష
రాజా:	విరూపాక్ష
అశోక:	ఉగ్రం
ఊర్వశి:	ఫర్హానా
రంభ:	భువన విజయం
మేనక:	కళ్యాణమస్తు, మ్యూజిక్ స్కూల్
అప్సర:	కస్టడీ
నామవరం	
వీఎస్.మహల్:	కస్టడీ
ధవళేశ్వరం	
మురళీకృష్ణ:	కస్టడీ
కడియం	
వెంకటసూర్య:	కస్టడీ

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి


ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న జక్కంపూడి రాజా


మోరంపూడి జంక్షన్‌లో ప్యూర్‌వెజ్ కేక్ కట్ చేస్తున్న ఆమంచి ఆంజనేయ గురుస్వామి


కడియంలో జరుగుతున్న హనుమాన్ శోభాయాత్ర

రాజమహేంద్రవరం సిటీ: హనుమజ్జయంతి వేడుకలు నగరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పుష్కర ఘాట్ ఆలయంలో కొలువైన ఆంజనేయునికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడ రామనామం వినిపిస్తుందో అక్కడ ఆంజనేయస్వామి కచ్చితంగా ఉంటారన్నారు. 20 ఏళ్లుగా బొండాడ దుర్గా రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో హనుమజ్జయంతి వేడుకలు ఎంతో వైభవంగా ఈ ఆలయంలో నిర్వహిస్తున్నారన్నారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ వాకచర్ల కృష్ణ తదితరులు ఉన్నారు.

వైభవంగా వేడుకలు

రాజమహేంద్రవరం రూరల్: నియోజకవర్గంలో ఆదివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మోరంపూడి జంక్షన్‌లోని వీరహనుమాన్ ఆలయంలో శ్రీసాయిభక్తాంజనేయ స్వీట్స్ అధినేత వలవల చక్రపాణి ఆధ్వర్యంలో ఆమంచి ఆంజనేయస్వామి గురుస్వామిచే 50 కిలోల ప్యూర్‌వెజ్ కేకును కట్ చేయించారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. బొమ్మూరులో జాతీయ రహదారి పక్కన ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో అన్నసమారాధన జరిగింది. బొమ్మూరు – రాజవోలు రోడ్డులో హనుమాన్ విగ్రహం ప్రసాద వితరణ చేపట్టారు.

ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో..

స్థానిక ఐదుబళ్ల మార్కెట్ సెంటర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో వేడుకలు నిర్వహించారు. ఉదయం నుంచీ స్వామివారి రజిత విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం, సిందూరపూజ, తమల పాకులతో పూజలు చేశారు. కోటిపల్లి బస్టాండ్‌లోని సుందర ఆంజనేయస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిగాయి.

హనుమాన్ శోభాయాత్ర

కడియం: హనుమజ్జయంతి సందర్భంగా కడియం ఆంజనేయస్వామి ఆలయం నుంచి హనుమాన్ శోభయాత్ర గ్రామంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో అభయ ఆంజనేయస్వామి ఆలయ కమిటీ, విఘ్నేశ్వర తాపీపనివారల సంఘం, గ్రామ ప్రజలు, హనుమాన్ భక్తులు, హిందూ ప్రచార కమిటీ సమితి సభ్యులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

ప్రకాశం నగర్: తిలక్ రోడ్డులోని షిర్డీసాయి రామ మందిరం ఆలయ సముదాయంలోని పంచముఖ ఆంజనేయస్వామి ఉపాలయంలో హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.